# ★ కలసిన బంధువులు ★

కుమారి జంధ్యాల సరోజ

ఆ రోజు మధ్యాహ్నం కమలపాఠాలు చదువుకోటానికి రాలేదు. సరళా, విమలా వచ్చేరు. కమలకోసం కాస్సేపు ఆగారు, కానీ కమల ఎంతకీ రాకుంటే వాళ్ళిద్దరూ "మాకు చెప్పెయ్ యీవాళకి" అన్నారు నళినితో. నళిని స్కూలుఫైనలు పాసయింది. ఏదో తోటి స్త్రీలకి యింత సాయపడి వృద్ధిలోకి తేవాలని వాళ్ళకి తనకొచ్చిన చదువూ, సంగీతం, ఇంకా ఇతర విషయాలు ఎన్నో చెప్పేది. చదువుకున్నానన్న గర్వం నళినికి ఏకోశానాలేదు. వాళ్ళతో చాలా చనువుగా ఉంటుంది. కానీ వాళ్ళిద్దరికన్నా కమలకూ నళినికే చాలా స్నేహం. వాళ్ళామాట అనగానే నళిని వాళ్ళకారోజు పాఠాలు చెప్పేసింది ఎట్లో.

సాయంత్రం నళిని కమల యింటికి వెళ్ళింది. కమల విచారంగా కూచునివుంది నళిని వచ్చేవేళకు. నళిని వెళ్ళి "ఏం కమలా అట్లావున్నావ్?" అనగానే కమలలేనినవ్వు తెచ్చిపెట్టుకుని "ఏంలేదే" అంది. "అదుగో ఏదో దాస్తున్నావు. ఈవేళ పాఠాని కెందుకు రాలేదు?"

కమల నళినితో చెప్పింది దాచి లాభంలేదని, "మా ఆయన ఇకమీదట మీయింటికి వెళ్ళవద్దన్నారు."

"ఎందుకూ?"

"అలా వెళ్ళటం ఆయనకేం బావులేదట. పరాయి వాళ్ళింటికెళ్ళి ఏం చదువులు? వాళ్ళింట్లో మగాళ్ళుండరా అన్నారు. ఇంకా వాళ్ళ చెల్లెలు ఇట్లాగే రోజూ ముగ్గులు నేర్చుకోడానికని వెళుతూండేదిట. ఆరోజు అట్లాగేవెళ్ళి ఇంతవరకూ అజాపజా లేదట. ఆయనకి ఆ చెల్లిఅంటే చాలా ప్రేమట. రోజులు బాగాలేవు వెళ్ళవొద్దన్నారు" అని ముగించింది.

కమల చెప్పటం చాలిస్తూనే నళిని ఒక్కసారి ఎట్లాగో అయిపోయింది. భయం, ఆశ్చర్యం ఒక్కసారి ఆమెలో ఉద్భవించాయి. కమల నళినిని చూడలేదు. నళిని తర్వాత కొంచెంసేపు మాట్లాడి ఇంటికి వెళ్ళిపోయింది. నళిని కమల యింటికి ఎప్పుడన్నా వస్తూవుంటుందిగాని ఆమె భర్తను ఎప్పుడూ చూళ్ళేదు. నళిని ఇంటికెళ్ళి కుర్చీలో కూచుని ఏదో ఆలోచిస్తోంది. ఆమె స్మృతిపథంలో ఎన్నో ఆలోచనలు రేగుతున్నాయి. ఒక్కసారి ఆమె మనోవీధిలో గతం స్ఫురించేసింది.

## 2

నళినీ ప్రకాశరావూ హైస్కూల్లో చదివేరోజుల్లో క్లాసుమేట్సు. వాళ్ళిద్దరికీ ఒకరి హృదయాలు ఒకరికి తెలిశాయి. ఒకరి అభిరుచులు ఇంకొకరికి సరిపడ్డాయి. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. కానీ యీ సంగతి పిట్టక్కూడా తెలీదు. నళిని స్కూలుఫైనలు పాసుకావటంతో ఆమె చదువాగిపోయింది. పై చదువు ఆ వూళ్ళో లేని కారణాన. ప్రకాశరావు మాత్రం బస్తీలో కాలేజి చదువు సాగిస్తోన్నాడు. ప్రకాశరావూ నళినిని ప్రేమించాడు అన్నమాటే కాని అతనికి ఆమె విషయం తప్ప ఇంకెవ్వరీ సంగతీ తెలీదు. నళిని యింటివైపు కూడా వెళ్ళేవాడుకాదు.

ఒక్కసారి కాలేజి సెలవులకు ప్రకాశరావు వచ్చాడు. తండ్రి జబ్బుతోవుండి ప్రాణం విడిచాడు. ఇక అతనికి "నా" అనేవాళ్ళెవరూలేరు. ఆ వూళ్ళో తనదీ అని చెప్పుకోడాన్కి ఆ యిల్లొకటేవుంది. దాంతో అతడి చదువుకు "బ్రేక్" పడింది. నళిని రోజూ ముగ్గులు నేర్చుకోడానికంటూ వెళ్ళి ప్రకాశరావు యింటికొచ్చేది. ప్రకాశరావు నీతి, నిజాయితీ ఉన్న మనిషి. అతడు నళినిని మనసారా ప్రేమించాడు. కానీ ఆమె తల్లిదండ్రుల్ని "ఆమెను తనకివ్వమని" అడిగే ధైర్యం లేకపోయింది. ఆమె చూస్తే ధనవంతుల బిడ్డ. తన కేముందిగనుక?

వాళ్ళు ఒక నిశ్చయానికొచ్చారు. బస్తీకెళ్ళి ఏదన్నా ఉద్యోగంలో చేరదామని. దానికి నళిని అంగీకరించింది, ఇద్దరూ చదువుకున్నవాళ్ళే. తమ బ్రతుకు గడుపుకోడానికి కష్టపడక్కర్లేదనే ధైర్యంతో రైలెక్కారు.

ప్రకాశరావు కాపూళ్ళో ఒక కంపెనీ మేనేజరు తెలుసు. అతడు ప్రకాశరావుకన్నా ఓ నాలుగేళ్ళు పెద్దవాడు. వాళ్ళిద్దరికీ అదేవూళ్ళో చదువుకునేరోజుల్లో స్నేహమైంది. ప్రకాశరావు ఇంటరులో ఉన్నప్పుడు అతను బి. యే. చదువుతున్నాడు. క్లబ్బులో వారికి బాగా స్నేహమైంది. వీళ్ళిద్దరికీ టేబుల్ టెన్నీసంటే చాలా యిష్టం. వాళ్ళకు తోడు లేకపోవటంతో బాగా స్నేహం పాతుకుపోయింది. అతను చదువులోనూ, ధనంలోనూ, ప్రకాశరావుకన్నా ఎక్కువే. అయినప్పటికీ అతడు ప్రకాశరావును ప్రాణమిత్రుడుగా చేసుకున్నాడు.

ప్రకాశరావు వచ్చినరోజునే ఓ ఇల్లు చూచి అందులో నళినిని దిగబెట్టి నేరుగా తన స్నేహితునివద్ద కెళ్ళాడు. అతడు ప్రకాశరావునుచూస్తూనే ఆనందభరితుడైపోయి ఉద్యోగం లేకున్నా ప్రత్యేకంగా అతనికై ఒకటి కల్పించి అందులో ఇరికించాడు. ప్రకాశరావు చాలా వుత్సాహంగా వుంటూ పనిచేస్తున్నాడు. నళినికేపనిచెయ్యాల్సిన అవసరం లేకపోయింది. తర్వాత కొన్నాళ్ళకే ఇద్దరూ రిజిస్టర్డ్ మారేజి చేసుకున్నారు.

వాళ్ళ జీవితం హాయిగా నడిచిపోతూంది.

నళిని ఒక నిట్టూర్పు విడిచింది గతాన్ని తల్చుకొని. ఇంతలో వాకిట్లో బూట్లచప్పుడు విని ఆమె తలెత్తి చూచింది. బూట్లు విప్పుకుని కాళ్ళు కడుక్కొని గదిలో కొచ్చాడు. "ఏమండీ యివాళ యింత ఆలస్యం చేశారేం" అంది. "ఆఁ ఏం లేదు. మా ఆఫీసరుగారి భార్యకు ఓ ప్రయివేటు టీచరు కావాలిట. (ఆడ) అందుకోసం ఇంత ఆలస్యమైంది. మంచి సంస్కారం ఉన్న మనిషిలే. చదువురాని ప్రకృతిబడిలో పెరిగిన పల్లెపడుచును పెళ్ళాడేడు. ఇప్పు డీమెకు చదువుకావాలనుందిట.

నళిని కామాటలు ఒళ్ళంతా కంపరమెత్తించాయి. ప్రొద్దునో సంఘటన, ఇపుడు మరోటి. ఏమవుతుందో? యీనాటకం" అనుకుంది.

"ఏంనళినీ ఏమంటావు మరి?" అన్నాడు ప్రకాశరావు.

"ఏమిటండీ?"

నువ్వామెకు టీచరుగా పనిచేస్తావా?" నవ్వాడు ప్రకాశరావు. "ఓ మరి ఎప్పట్నుంచి చేరాలేమిటి?" ప్రశ్నించింది నళిని.

ప్రకాశరావన్నాడు "రేపాదివారంకదూ, రేప్రొద్దుట వాళ్ళింటికి వెళదాం" అని.

ఆరోజు ఆదివారం.

గిరిరావు భార్యతో అన్నాడు "నాఫ్రెండు ప్రకాశరావుకి చెప్పాను. ఒక ఆడ టీచర్ని వెతకమని. వా డీ రోజు వస్తాడు. ఏం చదువుకుంటావా? ఇక్కడికేవచ్చి చెప్పే ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

కమల తలూపింది. కాని స్నేహభావంలో హాయిగా చదువుకోడంవేరు. యీవయసులో ఒక టీచర్ను జీతానికి పెట్టుకుని చదువుకోటం వేరు. ఆమె ఆలోచనల్లో పడ్డది.

పావుగంటగడిచింది. ఇంటిముందు ఏదో గుఱ్ఱపుబండీ ఆగింది. అందులోంచి ప్రకాశరావు దిగాడు. గిరిరావు ఎదురొచ్చి "ఏమిటీ ఒక్కడవే వచ్చావ్" అన్నాడు. "అదిగో వస్తోంది" అంటూ ప్రకాశరావు బండివైపు చూపించాడు. నళిని గుండెల్లో రైళ్ళు పరుగెత్తున్నాయి. ఆమె బండి దిగి తలొంచుకుని నడుస్తూవుంది. గిరిరావు ఆమెవైపుచూస్తూ ఏదోగ్రహించిన వాడిలా కంగారయ్యాడు. "నువ్వా చెల్లీ" అంటూ వచ్చాడు. "అన్నయ్యా" అంటూ నళిని గిరిరావు కాళ్ళమీదపడింది. ప్రకాశరావు అన్నదగ్గరే పనిచేస్తున్నాడని నళినికి తెలీదు. ప్రకాశరావే నళినిని పెళ్ళాడేడని గిరిరావుకి తెలీదు. నళిని తన మేనేజరు చెల్లెలని ప్రకాశరావుకి తెలీదు. తన స్నేహితురాలు తనభర్త చెల్లెలని కమలకు ఏం తెలుసు?